# ప్రేమ

## ప్రయాగ రామకృష్ణ

'రేపు మనమందరం పాలకొల్లు వెళ్తున్నాం' రాణి తన ఫ్రెండ్స్‌ని ఆహ్వానించింది.

'ఎందుకు?'

'ఎందుకో అక్కడికి వెళ్ళాక తెలుస్తుంది' వూరించింది రాణి.

'ఏమిటి అకేషన్'

'సస్పెన్స్'

'పుట్టిన రోజా అక్కడ సెలబ్రేట్ చేసు కుంటు న్నావా?'

'అవమానం. నాలుగేళ్ళ నుంచి స్నేహం చేస్తున్నారు నాతో. నా పుట్టిన రోజెప్పుడో కూడా తెలీదా మీకు' అదేదో అపరాధమైనట్టు అడిగింది రాణి.

'పెళ్ళి చూపులా' ఉత్కంఠ ఆపుకోలేక కళ్ళు పెద్దవి చేసుకుని అడిగింది ప్రేమ.

'సిగ్గులేకపోతేసరి. పెళ్ళి చూపులకి మీరంతా ఎందుకు? అసలు మా మధ్య మా అమ్మా నాన్న వుండడమే చిరాకు నాకు'

'మరేమిటే'

బుగ్గలు సొట్టలుపడేలా నవ్వింది రాణి.

'పోరగాణ్ణే సెటిల్ చేశాను'

'కంగ్రాట్స్. చక్రవర్తేం చేస్తున్నాడు'

'నీ కెలా తెలుసు'

'నువు రాణీగారి దర్జా వెలగబెడుతుంటావు కాబట్టే అతన్ని చక్రవర్తన్నాను' చెప్పింది ప్రేమ.

'ఓయమ్మో ఎలా వుంటాడే నీ విభుడు'

'మాస్టారుగా రేపు'

'మీది ప్రేమ పెళ్ళా'

'మీకు మలేరియా జ్వరమా'

అందరూ నవ్వారు.

చార్లెస్ డికెన్స్ 'టేల్ ఆఫ్ ది టు సిటీస్' పాఠం చెబుతూ అన్యమనస్కంగా వున్న నలభయ్యేళ్ళ మిస్ తలెత్తి చూసింది. రాణితోపాటు ఆ 'రో' లో కూర్చున్న వాళ్ళందర్నీ రెండు రోజులపాటు క్లాసులకు రాకుండా సస్పెండ్ చేసింది.

'హమ్మయ్య' అనుకుని మిస్‌కు థాంక్స్ చెప్పారు రాణి బృందం.

సెలవు ప్రాబ్లమ్ తీరిపోయింది.

మరునాడు ముద్దుగుమ్మలందరూ మిస్ ఇండియా పోటీలకు వెళ్తున్నట్టు తలా ఓ రకంగా మేకప్ అయ్యారు. వంగినా, కదిలినా, చివరికి పక్కంతా వెల్లాషెదురు చేసుకున్నా శరీరం మీద వున్నట్టు వునికే తెలీని పాముకుబుసం లాంటి చీరెలు కట్టుకున్నారు. చీర రంగుకి మ్యాచ్ అయ్యే గాజులు వేసుకున్నారు. నలుపూ, ఎరుపూ బొట్లు, పౌడర్ ప్యాకెట్లు, ఐలైనర్ లాంటివి సర్దుకుని పాలకొల్లుకు ప్రయాణమయ్యారు.

స్టేషన్‌కు చక్రవర్తి వచ్చాడు.

రాణి తన స్నేహితులందర్నీ అతనికి పరిచయం చేసింది.

'ఓహో, ఆహా, ఐసీ, గుడ్' అంటూ చేతులు వెనక్కి కట్టుకుని ముందుకూ వెనక్కీ వూగాడు.

'పంపి వెళ్దాం' అని స్టేషన్ ఎగ్జిట్ గుమ్మంవైపు నడిచాడు. బయటకు వెళ్ళాక నాలుగు రిక్షాలు పిలిచాడు.

ఒక్కో దాంట్లో ఇద్దరు ఎక్కారు. చివరికి చక్రవర్తి, రాణి మిగిలారు. 'ఆల్ ద బెస్ట్ . రోడ్డు మీ దేమీ అఘాయిత్యాలు చెయ్యకండి. బుద్ధిగా ఇంటికి రండి' అని ఇంకో రిక్షా పిలిచి దానికి టాప్ వేయించింది ప్రేమ.



వాళ్ళిద్దరూ దాంట్లో కూర్చున్నారు.

సరిగ్గా పది నిమిషాల తరువాత నాలుగు రిక్షాలూ ఓ ఇంటి ముందు ఆగాయి.

అందరూ బిలబిలా ఇంట్లోకి వెళ్ళారు.

చక్రవర్తి ఒక్కడే వాళ్ళమ్మకు. తండ్రిపోయినప్పటి నుంచీ సర్వం తనే అయి పెంచింది. ఏడాదిగా ఆవిడ ఆరోగ్యం సరిగా లేదు. హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్, షుగర్ చాలా వున్నాయి కంప్లయింట్స్ ఆవిడకు. రాణి వెళ్ళి అత్తగారి పాదాలకు దణ్ణం పెట్టింది. ఆవిడ కాబోయే కోడల్ని దగ్గరకు తీసుకుని కొడుకును పిలిచి పూలూ, అక్షతలూ తెప్పించి నెత్తిన చల్లింది.

'అంతకు ముందు ఇంత అధమస్తంగా లేదే తల్లీ! లేచి నా పనులు నేనే చేసుకుంటుండేదాన్ని. మరీ సంవత్సరం నుంచి...' అని తెలుగు సినిమాలో కన్నాంబలా దగ్గింది.

రాణి అత్తగారికి మంచినీళ్ళు ఇచ్చింది.

ఆవిడ అవి తాగి 'వచ్చే నెలలో మీ నాన్నగారు ముహూర్తం పెట్టేస్తామన్నారు. ఆ కాసిని పసుపు గింజలూ నెత్తినపడ్డాక నిక్షేపంగా ఇక్కడే వుండి చదువు కుందువుగాని. ఇన్నాళ్ళూ భోపాల్‌లో ఒంటరిగా లేడూ. మరో ఏడాది వుంటాడు. అప్పటికి నీ చదువూ అయిపోతుంది. నా ఆరోగ్యమూ కొంచెం కుదుటపడు తుంది' అంది.

రాణి బుద్ధిగా తలాడించింది.

ప్రేమ కంగారుపడింది.

వాళ్ళందరూ ఒకరి మొహాలు ఒకరు చూసు కున్నారు.

పెళ్ళయిన నెల రోజులకి చక్రవర్తిని ప్రమోషన్ మీద జమ్మూ ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ కబురు తెలిసి చక్రవర్తి, రాణి పొంగిపోయారు. 'ఇదంతా రాణి అదృష్టం' అని బంధువులంతా అన్నారు. కొత్తనవు సరదాల్లో మునిగితేలుతున్న చక్రవర్తికి ప్రమోషన్ వచ్చి నందుకు సంతోషంగా వున్నా, కాశ్మీర్ సోయగాల్ని చిక్కటి చలినీ ఒక్కణ్ణే అనుభవించటమేమిటా అని దిగులు కలిగింది.

ఏం చెయ్యడం? సెలవు పొడిగిద్దామా అంటే వచ్చిన ప్రమోషన్ వెనక్కిపోతుంది. ఉత్తరదేశ యాత్రలు చేయిస్తానని ఏదో ఒక వంకపెట్టి అమ్మను కూడా కాశ్మీర్ తీసుకుపోతే తను కమ్మగా భార్యతో కాపురం చెయ్యొచ్చు. కాని అమ్మ అంత దూరం వస్తుందా?

'ప్రమోషనూవద్దూ, ఏమీ వద్దూ! చేతనైనమటుకు మూడు వేలో, నాలుగు వేలో సంపాదిస్తున్నావు. అం చాలు. మరో రెండొందలు ఎక్కువ వస్తాయి కాశ్మీరమూ, కన్యాకుమారమూ పరిగెత్తక్కర్లేదు' అంది.

తండ్రి సంపాదించిన ఆస్తి నిలబెట్టుకుంటూ వు ఉద్యోగం సక్రమంగా చేసుకుంటే అది చాలంది.

చక్రవర్తి నీరు కారిపోయాడు.

తలుపుచాటు నుంచి రాణి కిసుక్కున నవ్వింది.

'నీకున్న రక్తపోటూ, చక్కెర వ్యాధీ ఇప్పుడిప్పు తగ్గేవేం కావు. ఏ వూరుపోయినా ఎక్కడున్నా అ వెంటే వుంటాయి. అలాంటప్పుడు నాతోపాటు రా డానికేమైంది? అభయాదేవి, వైష్ణవ దేవి, జ్వాలాముఖి

ఆలయాలు నువ్వెలాగో మూడను కూడా లేదు. కాశ్మీర్ వెళ్తే చిటికెలో చూడొచ్చు. ఢిల్లీలో బిర్లామందిరం వుంది. ఆగ్రాలో తాజ్‌మహల్ వుంది. మధురలో కృష్ణుడున్నాడు. అమృతసర్‌లో స్వర్ణ దేవాలయం వుంది' గుక్కతిప్పకోకుండా చెప్పాడు చక్రవర్తి.

'ఆ చివర చెప్పింది మనది కాదు అత్తగారూ, సిక్కులది' పెద్దగా నవ్వుతూ వంటింట్లోంచి అరిచింది రాణి.

'మా అమ్మే పెద్ద టెర్రరిస్టూ, సెపరేషనిస్టూ' గొణుక్కుంటూన్న చక్రవర్తితో ఆవిడమాటే ఖాయమంది.

మళ్ళీ మాట్లాడలేదు మానవుడు.

'రెండేళ్ళలాగూ భోపాల్‌లో వున్నావు. మరో సంవత్సరం వుండి ఏ అయ్య కాళ్ళో పుచ్చుకుని వెనక్కి వచ్చెయి. పొరుగు రాష్ట్రంలో మూడేళ్ళుంటే కావల్సిన చోటుకి వేస్తారని నువ్వే చెప్పావు. హాయిగా వచ్చేద్దువు గాని. అప్పటికి అమ్మాయి చదువుకూడా అయిపోతుంది. తెలివితేటలుండి పొలమూ, ఇల్లూ చూసుకుంటూ వుద్యోగం చేసుకున్నావంటే చల్లపల్లి జమిందారులా బతకొచ్చు' అంది తల్లి.

'నా తెలివితేటలేమో! నిన్ను, మీ నాన్న చదివిస్తే మాత్రం ఇందిరా గాంధీ అంత గొప్పదానివయ్యేదానివి. మూడేళ్ళ తర వాత వెనక్కిరావచ్చని అప్పుడు భోపాల్ వెళ్ళడం కోసం బుద్ధి గడ్డితిని చెప్పాను వీకు' అనుకున్నాడు చక్రవర్తి.

'అయితే కాళ్ళ దగ్గిరకొచ్చిన ప్రమోషన్ వదులుకో మంటావా?' అన్నాడు కొంచెం నిష్ఠూరంగానే.

'మీ యిష్టం నాయనా!' అందావిడ విష్ఠూరంగా.

రాణీని వదిలి వెళ్ళడం దుస్సాధ్యంగానే తోచింది చక్రవర్తికి. తీసుకువెళ్తే అమ్మకు కోపం వస్తుందేమో! పెళ్ళాం వస్తే ఇంకా తల్లెందుకని రాద్ధాంతం చేస్తుందేమో అనుకున్నాడు. ప్రస్తుతానికి రాణీని తీసుకువెళ్ళడమా, మానడమా అని ఆలోచనలో పడ్డాడు.

రాణీ గదిలోకి వచ్చింది.

సన్నజాజుల వాసన గుప్పుమంది.

చక్రవర్తి రాణీ వైపు చూశాడు.

రాణీ మాత్రం చక్రవర్తి తన వైపు చూస్తున్న సంగతి గమనిస్తూనే తనకేమీ తెలీనట్టు నటిస్తూ గోడకు తగిలించి వున్న అద్దం దగ్గరకు వెళ్ళి చెంపలూ, వెక్కిళ్ళూ సవరించుకుని వచ్చి మొగుడి పక్కనే పక్కమీదికి ఒరిగింది.

చక్రవర్తి పెద్ద లైటు తీసి బెడ్‌లాంప్ వెలిగించి భార్యను దగ్గరకు తీసుకున్నాడు.

'మరి నాలుగు రోజుల్లో నా సెలవు అయిపోతుంది. నేను భోపాల్ వెళ్ళి అక్కడ రిలీవ్ అయి ఆ తరువాత జమ్మూ వెళ్ళి జాయినవ్వాలి. నువ్వు కూడా వస్తావా? లేక కొన్నాళ్ళపాటు మీ అమ్మ దగ్గిరా, మా అమ్మ దగ్గిరా వుంటావా?' అని అడిగాడు.

'కొన్నాళ్ళపాటు అత్తగారి దగ్గరే వుంటాను' అని కళ్ళు కొంచెం పైకి ఎత్తి రియాక్షన్ ఏమిటో చూద్దాం అని అతని కళ్ళల్లోకి చూసింది.

అదిరిపడ్డాడతను.

అతనికి అంతా అగమ్యగోచరంగా వుంది. నమ్మ శక్యం కాకుండా వుంది.

మరునాడుకాక ఆ పక్క రోజే ప్రయాణం.






భార్యని తీసుకుని అత్తవారింటికి వచ్చాడు చక్రవర్తి. ఆ రోజల్లా భార్యని బజార్లవెంట తిప్పి ఆవిడ అడిగినవన్నీ కొన్నాడు. మధ్యాహ్నం సినిమాకు తీసుకు వెళ్ళాడు. సాయంత్రం ఇద్దరూ బీసెంట్ రోడ్డుకి వెళ్ళారు. ఏమిమిదింటి వరకు షికార్లు చేసివచ్చి అర్ధరాత్రి ట్రెయిన్‌కి హడావిడిగా చక్రవర్తి సూట్కేసు సర్దుకుంటుంటే చీరలూ, జాకెట్లూ తీసుకొచ్చి గుట్టలు గుట్టలుగా అతని ముందు పడేసింది రాణి. పెళ్ళికి తన బావగారిచ్చిన వి.ఐ.పి. సూట్కేసు మొగుడి ముందుకు నెట్టి స్నేహితురాళ్ళొస్తే కబుర్లు చెప్పడానికి వెళ్ళింది.

'సప్తెక్కడికీ ప్రయాణం - పాలకొల్లా' అడిగింది ప్రేమ కన్నింగ్‌గా.

'కాదు. కాశ్మీర్ సోయగాలు చూడడానికి వెళ్తున్నాను' అంది రాణి నాలిక మడతపెట్టి తలవేసి కన్నుకొడుతూ.

'పాపం మీ అత్తగారు...' అని ఇంకా ఏదో అనబోయిన ప్రేమ మాటల్ని రాణి పూర్తిచేస్తూ, 'ఇన్నాళ్ళ నుంచీ ఆవిడ ఒక్కతే పాలకొల్లులో లేదూ! మరో ఏడాదో, రెండేళ్ళో వుంటారలాగే' అంది.

'పాలకొల్లులో ఏడాదిపాటు అరణ్యవాసం చేస్తానని మరి మీ అత్తగారికి ఆనాడు మాటిచ్చావు'

'అప్పుడు పెళ్ళికాని పిల్లనే చెట్టే తల్లులూ! అబ్బాయి నచ్చాక, అతనికి ఆస్తి పాస్తులున్నాక ఆవిడ మాటకు అడ్డుపడి కాళ్ళదాకా వచ్చిన బేరం ఎందుకు చెడగొట్టుకోవాలని అప్పుడు సరే అన్నాను. ఇప్పుడు పెళ్ళయింది. 'నో' అంటున్నాను. నా మొగుడితో నేను పోతానంటున్నాను. తప్పేమిటి? 'అయినా పొయ్యి మీదున్న కూరనీ, పొరుగూళ్ళో వున్న మొగుణ్ణీ ఒక కంట కనిపెట్టాలే తల్లీ. చిన్నవాళ్ళు, మీకు అభం శుభం తెలీదు' అని ముసిముసిగా నవ్వింది రాణి. చక్రవర్తికి వినపడిందో లేదోనని లోపలికి తొంగి చూసింది. చీరలూ, జాకెట్ల మధ్య పతికిలబడి వున్నాడు.

'బ్రిలియంట్' చేతి బొటనవేలు ఎత్తి సుప్పొడు చూపింది ప్రేమ.

శ్రీ




ఉత్పత్తిదారులు
ఆఫీసు ఫోన్ నెం. 2235
ఇంటి ఫోన్ నెం. 785

శ్రీ గోల్డు కవరింగ్ వర్క్సు.
మేనేజింగ్ పార్టనర్: సి.హెచ్.నాగేశ్వరరావు.
పోస్టు బాక్సు నెం.35 శ్రీమహల్ H.O. మచిలీపట్నం 521 001.

సేల్సుడిపోలు: (1) స్టాలు నెం:2, పట్టాభి మార్కెట్, మచిలీపట్నం (2) శేషయ్య వీధి, విజయవాడ-1 (3) ఏలూరు రోడ్డు, విజయవాడ-2 (4) 17/317, ట్రంక్ రోడ్, నెల్లూరు. (5) 141 గ్రా. కార్ స్ట్రీట్, తిరుపతి. (6) 50 గాంధీ రోడ్ తిరుపతి (7) రామార్ కోయిల్ వీధి, చిత్తూరు. (8) 14/43, సుభాష్ రోడ్, అనంతపూర్. (9) మద్రాస్ రోడ్, కడప (10) నెం.14, మునిసిపల్ బిల్డింగ్స్, కర్నూలు (11) నెం 212, బి, నాగులకుంట రోడ్ - నంద్యాల (12) 181, బసవన్న గుడివీధి, అవెన్యూరోడ్ క్రాస్, బెంగుళూరు-53 (13) గాంధీ బజార్, బెంగుళూరు-4 (14) 86, జయంతి బిల్డింగ్స్ అవెన్యూరోడ్, బెంగుళూరు-2 (15) 77-1 కళ్యాణ్ బిల్డింగ్స్, బాలెపేట, బెంగుళూరు-53 (16) మునిరెడ్డి పాలెం, బెంగుళూరు (17) కావదరత్ రోడ్, బెంగుళూరు. (18) గాంధీబజార్, షిమోగా.